భాషా ప్రయుక్త రాష్ట్రాలకు

## ఆద్యులు పొట్టి శ్రీరాములు: కలెక్టర్ వెంకటేశ్వర్

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** అమరజీవి పొట్టి శ్రీరాములు భాష ప్రయుక్త రాష్ట్రాలకు ఆద్యులని, భావితరాలకు ఆదర్శనీయమైన వ్యక్తి అని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన సేవ తత్పరతను చాటుతూ ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నరసింహులు, డిఆర్డిఏ పిడి శోభన్ బాబు, ల్యాండ్ అండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్ కుమార్, డిఐపిఆర్ఓ గురుస్వామి శెట్టి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమేష్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా సిఐటియు జెండా రెపరెపలు

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** సిఐటియు 18వ జాతీయ మహాసభలను విజయవంతం చేయడానికి నడుపుతున్న ప్రచారంలో భాగంగా, సోమవారం సిఐటియు తిరుపతి జిల్లా కార్యాలయంలో జెండాను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వీఎస్ మణ్యం జెండాను ఎగురవేశారు. జెండా ఆవిష్కరణ సందర్భంగా, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్. జయచంద్ర, ప్రధాన కార్యదర్శి టి.సుబ్రమణ్యంలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్ ద్వారా శ్రమ చట్టాల్లో చేపట్టనున్న మార్పులపై ఆందోళన వ్యక్తం చేపట్టనున్నట్లు తెలిపారు. రాజ్యాంగానికి విరుద్ధంగా లేబర్ కోడ్స్ తీసుకొచ్చారని విమర్శించారు.

### సిఐటియు మహాసభలకు తరలిరండి

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** ఈ నెల 31వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖలో జరిగే అఖిల భారత 18వ సిఐటియు మహాసభలకు కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున తరలి రావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య పిలుపునిచ్చారు. సిఐటియు అఖిల భారత మహాసభలకు సంఘీభావంగా సోమవారం పట్టణంలోని కూరగాయల మార్కెట్, వేడాం ఆటో స్టాండ్, పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద ఎర్రజెండాలు ఎగురవేశారు. కార్పొరేట్ కు బానిసవుతున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకవసరమైన భవిష్యత్తు ప్రణాళికలను మహాసభల్లో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. నాయకులు దాసరి జనార్ధన్, గంధం మణి, కుమార్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - గూడూరు టౌన్:** హక్కుల సాధనకు, కార్మిక లోకం పోరాటాలకి సిద్ధం కావాలని సి.ఐ.టి.యు నాయకులు పిలుపు నిచ్చారు. విశాఖపట్నంలో జరుగనున్న సిఐటియు 18 వ అఖిలభారత మహాసభలు జయప్రదం చేయాలని జిల్లా కమిటి పిలుపు మేరకు సోమవారం తిరుపతి జిల్లా, గూడూరు సి.ఐ.టి.యు కార్యాలయం వద్ద అన్ని సంఘాల ఆధ్వర్యంలో సి.ఐ.టి.యు జెండాను, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలంటూ సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టనున్నామని తెలిపారు. కార్మికులు వేలాదిగా తరలిరావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు అధ్యక్ష, కార్యదర్శులు పామంజి మణి, బి.వి.రమణయ్య, గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్, మున్సిపల్ సంఘం జిల్లా అధ్యక్షులు ధారా కోటేశ్వరరావు, నాయకులు అడపాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - సత్యవేడు:** సిఐటియు18 వ ఆల్ ఇండియా మహాసభలు విశాఖపట్నంలో 31 నుండి జనవరి4 వరకు అఖిలభారత మహాసభలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర కమిటీ వాడవాడలా సిఐటియు కార్మిక జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. సోమవారం సత్యవేడులో సిఐటియు ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మెలుగు రమేష్ పిలుపునిచ్చారు. కార్మికుల జెండాను సిఐటియు సీనియర్ నాయకులు దేశాండీ అరుణాచలం ఆవిష్కరణ చేశారు. కార్మిక హక్కులను కాపాడుకునేందుకు, లేబర్ కోడ్లను వ్యతిరేకించాలని ఈ మహాసభల నిర్వహణ ఉద్దేశ్యమన్నారు. ఈ జెండా ఆవిష్కరణలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మునుస్వామి, తిరుమలరెడ్డి, మండల నాయకులు కృష్ణయ్య, విజయభాస్కర్, కోలాపురి ఎలయ్య, అందెరి పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** సిఐటియు అఖిలభారత మహాసభలు డిసెంబర్ 30న ప్రారంభమై, జనవరి 4వరకు జరుగనున్న నేపథ్యంలో సోమవారం పుత్తూరు పట్టణంలోని అంగన్వాడి కేంద్రాల్లో, ఆటో స్టాండ్ల దగ్గర సిఐటియు జెండాను సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్ ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ కార్మిక సమస్యలపై ఈ మహాసభలో చర్చిస్తామన్నారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ముని కుమారి, యుటిఎఫ్ నాయకులు రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

### చలో విశాఖ గోడ పోస్టర్లు ఆవిష్కరణ

**ప్రజాశక్తి - రేణిగుంట:** విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుండి జరిగే సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు జయప్రదం కావాలని ఆకాంక్షిస్తూ.. రేణిగుంట బుగ్గ వీధిలోని అంగన్వాడి సెంటర్ వద్ద సిఐటియు జెండా ఎగురవేశారు. అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షురాలు ధనమ్మ నాయకత్వంలో బాలబడి పిల్లలు, సిఐటియు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కార్మికులు కదలి రావాలని "చలో విశాఖ" గోడ పోస్టర్లను సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొండ్రెడ్డి హరినాథ్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ రేణిగుంట ప్రాజెక్టు అధ్యక్షురాలు ధనమ్మ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొండ్రెడ్డి హరినాథ్, సీనియర్ కామ్రేడ్ వెంకటరమణ, శ్రామిక మహిళా నాయకురాలు ఈశ్వరమ్మ, మహాలక్ష్మమ్మ, సులోచన, పద్మమ్మ, ఆర్టీసీ రిటైర్డ్ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

# వినతుల వెల్లువ..!

### ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 363 అర్జీలు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** క్షేత్రస్థాయిలో పరిష్కారానికి నోచుకోని అపరిష్కృత సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల వద్ద పరిష్కరించుకోవాలని వచ్చే అర్జీదారులకు సకాలంలో స్పందించి పరిష్కార మార్గాలు చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులుతో పాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేందర్ రెడ్డి, సుధారాణి, రోజ్ మాండ్ లతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని, పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ ఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. పీ జి ఆర్ ఎస్ లో వచ్చు అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రెవిన్యూ శాఖకు 225, పంచాయతీ రాజ్ 19, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 13, సెర్ప్ 12, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ 10, పోలీస్ శాఖకు 16 అర్జీలు వచ్చాయని అధికారులు ప్రకటించారు.

### యానాదుల భూములు కాపాడండి.. కలెక్టరేట్ వద్ద నిరసన

తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల రెవెన్యూ లెక్క దాఖలలో జి.చెంగళరాయులు సర్వే నంబరు 940/4లో ఎకరా 6 సెంట్లు, పి.లక్ష్మీదేవి సర్వే నంబరు 940/6లో ఒక ఎకరా 43 సెంట్లు, 940/3లో 94 సెంట్లు సి.జె.యఫ్.ఎస్ భూములను స్థానికంగా ఉన్న యానాదీలు డి.పట్టా, 1బి, అడంగళ్, పాస్ బుక్స్ భూ రికార్డులు కలిగి అనుభవంలో ఉన్నారని, కబ్జాదారులైన చిట్టెచర్లకి, నగరికి చెందిన గ్రామస్తులు టి.యన్.సీతాపతి, వేణుగోపాల్, బాలాజీ యానాదులను భయపెట్టి, దౌర్జన్యం చేసి కులం పేరుతో దూషించి వారి అధీనంలోకి భూములను తీసుకున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇప్పటికే పలుమార్లు అధికారులకు అర్జీ ఇవ్వడం జరిగిందని కలెక్టర్ కు కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి మాల్యాద్రి వివరించారు. స్పందించిన కలెక్టర్ వారికి సంబంధించిన భూములను సర్వే చేసి లబ్ధిదారులకు అప్పగిస్తామని, దీనికి సంబంధించిన దౌర్జన్యంగా కులం పేరుతో దూషించిన వారిపై కూడా విచారించి కేసులు నమోదు చేస్తామని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్, దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై.నందయ్య, గ్రామస్తులు జి.చెంగళరాయులు, జి.పావని, పి.లక్ష్మీదేవి, చెంచయ్య తది తరులు పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీల భూములను కాపాడండి

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** తిరుపతి జిల్లాలో ఎస్సీ, ఎస్టీలు సాగుచేసుకుంటున్న ప్రభుత్వ భూములు పెత్తందారుల ఆక్రమణకు గురువుతున్నాయని, వారిపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్రా మాలాద్రి డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం తిరుపతి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పుత్తూరు మండలం, గోపాల కృష్ణాపురం గ్రామ వాసులకు సర్వే నంబర్ 35/2 తొర్రూరు లెక్క దాఖలలో ఎస్టీలు 50 సంవత్సరాలుగా మామిడి చెట్లు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఆ భూమిని వేలు మొదలియార్ అనే వ్యక్తి అధికారుల సహకారంతో, తప్పుడు రికార్డులు సృష్టించి ఎస్టీలను భయభ్రాంతులను గురి చేస్తున్నాడని ఆరోపించారు. అదేవిధంగా భాకరాపేట మండలంలో కూడా భూములను ఇదేవిధంగా ఆక్రమించుకుంటూ వారిని కూడా పెత్తం దారులు ఇబ్బందులు పెడుతున్నారని తగు న్యాయం చేయాలని కోరారు. స్పందిచిన జిల్లా కలెక్టర్ విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేష్, నాయకులు వై.నందయ్య, నాగభూషణం కాంతారావు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### నగర పాలక సంస్థ కార్యలయంలో.. 27 వినతులు

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 27 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 16 మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 11 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ, కమిషనర్‌ను కోరారు. కొరమేను గుంటలో కుక్కల బెడద పరిష్కరించాలని, ఎం.ఆర్.పల్లి వంద అడుగుల రోడ్డు నందు స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, తిలక్ రోడ్లో ఉన్న బ్యాంకు ముందు కాలువపై షెల్టర్ వేశారు, పరిశీలించాలని, భూగర్భ డ్రైనేజీ లీకేజీ అరికట్టాలని, కొరమేనుగుంట పోస్టల్ కాలనీలో తెలుగు గంగ నీరు సక్రమంగా రాలేదని, శివజ్యోతినగర్ లో అనధికారికంగా నిర్మిస్తున్న ఏడంత భవనాన్ని పరిశీలించాలని, పాడిపేట హౌసింగ్ కాలనీ నందు నిర్వహణ సరిగా లేదు పరిశీలించాలని, స్విమ్స్ మార్గంలో చిరు వ్యాపారస్థులు ఎక్కువగా ఉండటం వల్ల ఇబ్బందిగా ఉంది పరిశీలించాలని కోరారని తెలిపారు. ఆయా సమస్యలను అధికారులకు పంపామని త్వరగా పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపి ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

### డయల్ యువర్ ఎపిఎస్పిడిసిఎల్ సిఎండికి.. 54 వినతులు

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి" కార్యక్రమం ద్వారా 54 వినతులు అందినట్లు ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఐటీ) పి.అయూబ్ ఖాన్ తెలిపారు. సంస్థ పరిధిలోని 9 జిల్లాల నుంచి వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను విన్నవించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో జాప్యం, విద్యుత్ లైన్ మార్పు, లో-ఓల్టేజ్ సమస్య, ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంపు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తదితర సమస్యలు వీటిలో వున్నాయని తెలిపారు. అయూబ్ ఖాన్ మాట్లాడుతూ దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ సంబరు: 9133331912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు పి.హెచ్. కె. ఆదిశేషయ్య, జానకి రామ్ తదితరులు పాల్గొన్నారు.

### ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ

ఇంధన పరిరక్షణ వారోత్సవాలను పురస్కరించుకుని ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో సోమవారం సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఇంధన పరిరక్షణపై వినియోగదారులకు అవగాహన కల్పించడంలో భాగంగా సోమవారం ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీస్ నుంచి సైకిల్ ర్యాలీని మొదలుపెట్టారు. అన్నమాచార్య సర్కిల్, ఎంఆర్ పల్లి సర్కిల్, బాలాజీ కాలనీ, ఇస్కాన్ టెంపుల్, భవాని నగర్, తుడా కార్యాలయం, కొర్లగుంట జంక్షన్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా సాగిన ఈ సైకిల్ ర్యాలీని ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఐటి) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్ ఆర్ డి) కే.గురవయ్యలు ప్రారంభించారు.

## నో హెల్మెట్ నో పెట్రోల్ ర్యాలీ ప్రారంభం

జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం తిరుపతి పట్టణంలోని జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ నుండి సుమారు 700 మందితో ఏర్పాటు చేసిన నో హెల్మెట్ నో పెట్రోల్ ర్యాలీని జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడితో కలసి జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాల కారణంగా సుమారు 500 మంది ద్విచక్ర వాహనదారులు మరణిస్తున్నారని, వీరిలో చాలా వరకు హెల్మెట్ లేకపోవడంతో తలకు బలమైన గాయాలై మరణించారన్నారు. హెల్మెట్ ధరించి ఉన్నట్లయితే వీరు ప్రాణాలతో ఉండే అవకాశం ఉండేదన్నారు. జిల్లా పోలీస్ శాఖ ద్వారా నో హెల్మెట్ - నో పెట్రోల్ ర్యాలీ నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా నేటి నుండి జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ బంక్‌ల్లో హెల్మెట్ లేనిదే ద్విచక్ర వాహనాలకు పెట్రోల్ ఇవ్వడం ఉండదని తెలిపారు. జిల్లా ఎస్ పి సుబ్బరాయుడు మాట్లాడుతూ హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధించడం తమ ధ్యేయం కాదని, ప్రజల భద్రత తమ భాధ్యతని పేర్కొన్నారు.

### శ్రీసిటీలో 'నో హెల్మెట్ - నో ఎంట్రీ'

**ప్రజాశక్తి - శ్రీ సిటీ(సత్యవేడు) :** తిరుపతి ఎస్పీ ఆదేశాల మేరకు శ్రీసిటీ పోలీసులు శ్రీ సిటీ సెక్యూరిటీ సిబ్బంది సహకారంతో 'నో హెల్మెట్ - నో ఎంట్రీ నిబంధన ప్రారంభించారు. ఈ నిబంధనను శ్రీసిటీ అంతటా కఠినంగా అమలు చేశారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులను శ్రీసిటీలో ప్రవేశానికి నిరాకరించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీసిటీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సబ్ ఇన్‌స్పెక్టర్ సుధీర్ కుమార్ రెడ్డి, శ్రీసిటీ సెక్యూరిటీ చీఫ్ వై.రమేష్ పర్యవేక్షించారు.

### "నో హెల్మెట్ - నో పెట్రోల్"

**ప్రజాశక్తి - రేణిగుంట:** తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట పట్టణంలో సోమవారం డిఎస్పీ ఆధ్వర్యంలో రేణిగుంట సీఐ జయచంద్ర వారి సిబ్బంది, గాజులమండ్యం సీఐ మంజునాథ రెడ్డి వారి సిబ్బంది, రోడ్ సేఫ్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.నో హెల్మెట్ - నో పెట్రోల్", "నో హెల్మెట్ -నో రైడ్" అనే నినాదాలతో అంబేద్కర్ విగ్రహం కూడలి నుంచి చెక్ పోస్ట్ పెట్రోల్ బంకు వరకు ర్యాలీ చేపట్టారు.

### హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు సోమవారం డిఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పుత్తూరు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హెల్మెట్ చట్ట భయంతో కాదు కుటుంబ భవిష్యత్తు కోసం ధరించాలన్నారు.

### హెల్మెట్ తప్పనిసరి

**ప్రజాశక్తి - సత్యవేడు:** హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని నో హెల్మెట్ నో పెట్రోల్ కార్యక్రమంలో ద్విచక్ర వాహనదారులకు సత్యవేడు స్థానిక ఎస్సై రామస్వామి, అడిషనల్ ఎస్సై లావణ్య జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు స్థానిక సీఐ మురళి నాయుడు సూచనల మేరకు సోమవారం హెచ్.పి పెట్రోల్ బంక్ వద్ద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు పోలీసులు ద్విచక్ర వాహనదారులు విద్యార్థులు పాల్గొన్నారు.

## విజ్ఞాన సమ్మేళనానికి ఏర్పాట్లు

**ప్రజాశక్తి - క్యాంపస్ :** తిరుపతి, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో భారతీయ విజ్ఞాన సమ్మేళనం 26 నుండి 29 వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలనుండి వచ్చే 1500 మంది ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ సమ్మేళనంలో శాస్త్రసాంకేతిక రంగాలలోని నూతన ఆవిష్కరణలు, భారతీయ విజ్ఞానవైభవం గురించి పరిశోధనాత్మకమైన, ఆలోచనాత్మకమైన అనేక చర్చాసదస్సులు జరుగనున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ రానున్నారు. ముగింపు సమావేశానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి సభ్యురాలు డాక్టర్ శామిక రవి, కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి కార్యదర్శి అభయ్ కరండికర్‌జీలు రానున్నారు.

## 17న భారత రాష్ట్రపతి తిరుపతి జిల్లా పర్యటన

**ప్రజాశక్తి - రేణిగుంట:** ఈ నెల 17న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, 16,17 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ తిరుపతి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ప్రముఖుల పర్యటనకు సంబంధిత అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. సోమవారం రేణిగుంట విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన ముందస్తు భద్రతా శ్రేణి లైజన్ (ఏ.ఎస్.ఎల్) అధికారుల సమన్వయ సమావేశంలో జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడుతో కలిసి సమీక్ష నిర్వహించి ప్రముఖుల పర్యటనలో భాగంగా ముందస్తు ఏర్పాట్ల పై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాష్ట్రపతి ఈ నెల 17వ తేదీన తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాలోని స్వర్ణ దేవాలయం దర్శనార్థం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని, అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా వేలూరు వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారని తెలిపారు. అనంతరం తిరిగి రేణిగుంట విమానాశ్రయం చేరుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కానున్నారన్నారు. గవర్నర్, రాష్ట్రపతి పర్యటనల నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని అదేశాలు జారీ చేశారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ పోలీస్ శాఖ తరపున బందోబస్తు కట్టుదిట్టంగా ఉండాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ అధికారి నాగబాబు, అడిషనల్ ఎస్పీలు రవి మనోహరాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎస్‌టియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి భీమినేని మునికృష్ణ నాయుడు

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని ఎస్‌టియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి భీమినేని మునికృష్ణ నాయుడు పేర్కొన్నారు. సోమవారం ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా అధ్యక్షులుగా వి.సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా భీమినేని మునికృష్ణ నాయుడు, ఆర్థిక కార్యదర్శిగా జి. దేవేంద్ర యాదవ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మునికృష్ణ నాయుడు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో సంఘ బలోపేతం, నిర్మాణం, సభ్యత్వ నమోదు పెంచడం, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటూ సమస్యలను విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. విద్యా బోధనకు ఆటంకం కలిగిస్తున్న యాప్‌లను తొలగించాలని కేవలం ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయాలని, ఇప్పటికే సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు కల్పించడంలో ప్రభుత్వం సహకరించాలని కోరారు.

## ఆలయాల్లో యూపీఐ చెల్లింపులకు క్యూఆర్ కోడ్స్

**ప్రజాశక్తి - తిరుమల:** దేశవ్యాప్తం ఉన్న 60 టీటీడీ ఆలయాల్లో భక్తులు సులభతరంగా యూపీఐ చెల్లింపులు చేసేందుకు వీలుగా కియోస్క్ మిషన్లు, క్యూఆర్ కోడ్స్ ఏర్పాటు చేయాలని అధికారులను టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలోని ఆయన కార్యాలయంలో సోమవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల్లో టీటీడీ నిర్మించదలచిన ఐదువేల ఆలయాలకు గాను అవసరమైన రెండు, మూడు డిజైన్లు సిద్ధం చేయాలని సీఈని ఆదేశించారు. తిరుపతి, వినాయక నగర్ వద్ద ఉన్న టీటీడీ స్టాఫ్ క్వార్టర్స్ ఆధునీకరణ పనులను త్వరితగతిన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని చీఫ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు జాప్యం లేకుండా చూడాలని తెలిపారు. శ్రీవారి ఆలయంలో ఉన్న కదిలే వంతెన మరమ్మతు పనులను వైకుంఠ ఏకాదశిలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తిరుమల తరహాలో తిరుచానూరు, గోవిందరాజస్వామి ఆలయంలో కూడా టీటీడీ సేవలపై అభిప్రాయ సేకరణ చేయాలన్నారు. ఈ సమావేశంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీ అండ్ ఎస్వో మురళీకృష్ణ, ఎఫ్.ఏ.సీఏఓ బాలాజీ, సీఈ సత్యనారాయణ, డిప్యూటీ సీఎఫ్ ఫణి కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రీవాల్యుయేషన్ ఫలితాల్లో అయోమయం

సగం మందికే ఫలితాల వెల్లడి

పరీక్షలు రాయాలా? వద్దా? తికమకలో విద్యార్థులు

విద్యార్థి సంఘాల ధర్నాతో ఫలితాలు విడుదల



వర్శిటీ అధికారులతో మాట్లాడుతున్న విద్యార్థులు

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరీక్షల విభాగంలో సమస్యలు మళ్లీ మొదలయ్యాయి. గత సంవత్సరం మూడవ సెమిస్టర్, ఐదవ సెమిస్టర్ పరీక్షలు రాసిన బీటెక్ విద్యార్థులు కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారు. వాటికి రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అయితే దాదాపు 10 నెలలు గడిచినా ఇప్పటివరకు రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల కాలేదు. ఫలితాలు రాకపోవడంతో ప్రస్తుతం జరుగుతున్న మూడవ సెమిస్టర్‌కు ఫీజు చెల్లించి పరీక్షలు రాయడానికి విద్యార్థులు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కొంతమంది విద్యార్థులు బీ-5 సెక్షన్‌కు వెళ్లి రీవాల్యుయేషన్ ఫలితాలను తెలుసుకున్నారు. ఆ విషయం తెలిసిన మరికొంతమంది విద్యార్థులు మధ్యాహ్నం వెళ్లి ఫలితాలు వెల్లడించమని కోరగా, ఫలితాలు ఎవరికీ ఇవ్వవద్దని రెక్టర్ ఆదేశించారని అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు విద్యార్థి సంఘాల దృష్టికి తీసుకెళ్లగా, తక్షణమే అక్కడికి చేరుకున్న విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. దీనికి స్పందించిన రెక్టార్ అప్పారావు, సీఈ రాజమణిక్యం యుద్ధప్రాతిపదికన రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కో-కన్వీనర్ అశోక్ హిడ్మా, వైయస్సార్ విద్యార్థి విభాగం యూనివర్సిటీ అధ్యక్షుడు మన్యం ప్రేమ్‌కుమార్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ మాట్లాడుతూ అధికారులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుకోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ, ఎంఆర్ నాయక్,ఏపీ విహెచ్ఎస్ అధ్యక్షుడు ముని తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని నియోజకవర్గాలను

## సమానంగా అభివృద్ధి చేస్తాం : తుడా చైర్మన్

ఐసిఎల్ఇఎల్ సౌత్ ఆసియా ప్రతినిధులతో తుడ చైర్మన్ దివాకర్ రెడ్డి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ఇటీవల జరిగిన ఏఆర్ఐఎస్ఈ సమ్మిట్‌లో పాల్గొని, అక్కడ వివిధ జాతీయ స్థాయి కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఐసిఎల్ఇఎల్ సౌత్ ఆసియా ప్రతినిధులు సోమవారం తుడా ఆఫీసులో తుడా చైర్మన్, అధికారులకో భేటీ అయ్యారు. ఐసిఎల్ఇఎల్ అంతర్జాతీయ స్థాయిలో స్థానిక ప్రభుత్వాలకు పర్యావరణ, నీటి సంరక్షణ వంటి అంశాలపై స్థిరమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవడానికి, లక్ష్యాలను చేరుకోవడానికి సాంకేతిక సలహాలను అందిస్తుంది. తుడా పరిధిలోని 9 నియోజకవర్గాలలో పర్యావరణ పరిస్థితులను పరిశీలించి, వాటికి సంబంధించిన మౌలిక వసతులు, సదుపాయాలు కల్పన కోసం స్థిరమైన లక్ష్యాలను చేరుకోవడానికి ఉపయోగపడుతుంది. తుడా చైర్మన్ మాట్లాడుతూ తుడా పరిధిలో అన్ని నియోజకవర్గాలలో సమానంగా అభివృద్ధి చేయాలని దృఢ సంకల్పంతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. పేరూరు చెరువు నుండి అవిలాల చెరువుకు కాలువ ద్వారా నీరు అందించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, తిరుపతిలో శాశ్వత భూగర్భ జలాలను పెంచడం ద్వారా తాగునీటి కొరతను తగ్గించవచ్చని పేర్కొన్నారు. తుడా పరిధిలో భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరని, పాత లేఔట్లలో పార్కులను గుర్తించి వాటిని అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. నూతన భవనాలకు అనుమతుల సమయంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు తప్పనిసరని, ద్వారా విద్యుత్ వినియోగం తగ్గుతుందన్నారు."సౌత్ ఆసియా డిపార్ట్మెంట్ సెక్రటరీ జనరల్ ఈమని కుమార్ మాట్లాడుతూ ఐసిఎల్ఇఎల్ ద్వారా అమరావతి, కాకినాడ వంటి నగరాలలో వాతావరణం పరిస్థితులపై సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం విశాఖపట్నంలో చేస్తున్నామని తెలిపారు. తుడా పరిధిలో కూడా పరిస్థితులను పరిశీలించి, వాటికి తగిన సలహాలను, సూచనలు ఇవ్వడానికి, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డితో చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ దేవి కుమారి, ఎస్ ఈ కృష్ణారెడ్డి,ఈ ఈ రవీంద్ర,డి ఈ నరేష్ బాబు, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి సూర్యనారాయణమ్మ, జూనియర్ ప్లానింగ్ అధికారులు వాణి శ్రీ,వాసుదేవ నాయుడు, హార్టికలర్ అధికారి మాలతి తుడా అధికారులు పాల్గొన్నారు.

## ఎంజీఎం సేవలు అభినందనీయం

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** శ్రీకాళహస్తి ప్రాంత ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, వ్యాపార రంగాల్లో విశేష సేవలందిస్తున్న ఎంజీఎం సంస్థలను టీడీపీ ఎక్స్ ఆఫీస్యో పొలిట్ బ్యూరో సభ్యులు, నాలెడ్జ్ సెల్ చైర్మన్ గురజాల మాల్యాద్రి కొనియాడారు. మాల్యాద్రి సోమవారం ఎంజీఎం నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా కలిసి భోజనం చేస్తూ ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ప్రముఖ వ్యాపార దిగ్గజంగా ఎంజిఎం ఎదిగినా శ్రీకాళహస్తి ప్రాంత వాసులకే ఆ సేవలను అంకితం చేయడం గొప్ప విషయమని మాల్యాద్రి పేర్కొన్నారు. ఎంజీఎం సంస్థలు మరింత వృద్ధిని సాధిస్తూ శ్రీకాళహస్తి ప్రాంత ప్రజలకు మరిన్ని సేవలు అందజేయాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా విద్యా, వైద్య రంగాల్లో నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్ ఇటీవల తిరుపతి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ గా ఎన్నిక అయినందుకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుపతి ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదేశాల మేరకు, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పుత్తూరు మండలం రామకృష్ణాపురం పంచాయతీలో సిసి రోడ్డు నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి జడ్పీ నిధులు రూ.7.5 లక్షలు మంజూరయినట్లు ఆయన తెలిపారు.

### యూరియా పంపిణీ

పుత్తూరు మండలం, తడుకు పంచాయతీ తడుకు రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రూరల్ పార్టీ అధ్యక్షులు అరవ బాలాజీ, ప్రధాన కార్యదర్శి హేమంత్ కుమార్, తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, కూటమి నాయకులు అమర్నాథ్, హరి ప్రసాద్, భాస్కర్ రెడ్డి, కోట గజపతి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ స్థలం పరిశీలన

**ప్రజాశక్తి - వాకాడు :** వాకాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం స్థలాన్ని చైర్మన్ మర్రి ప్రమీల, వైస్ చైర్మన్ దువ్వూరు మధుసూదన్ రెడ్డి సోమవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ స్థలంలోని చెట్లను శుభ్రం చేయించి రైతు బజార్, చేపల మార్కెట్, వాణిజ్య సముదాయ భవనాలకు సంబంధించి అనుమతులు మంజూరుకు ఎమ్మెల్యే ద్వారా కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సూపర్వైజర్, పి.రవిచంద్ర, ఇ.భుజగేంద్రరావు, ధన శేఖర్, పోలమ్మ, దారా.సురేష్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డేకు 9అర్జీలు

**ప్రజాశక్తి -దొరవారిసత్రం :** దొరవారిసత్రం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేకు 9 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ శైల కుమారి తెలిపారు. 9 అర్జీలు అన్నదాత సుఖీభవకోసం వచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ గోవర్ధన్, ఏఓ జ్యోతి, ఏపీఎం, మునిరజా, అధికారులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ సేవలు సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి - నాగలాపురం :** ప్రముఖ పుణ్యక్షేత్రాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఆన్ లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పల్లి కొండేశ్వర స్వామి ఆలయ చైర్మన్ పద్మనాభ రాజు కోరారు. ఆలయ ఆన్ లైన్ సేవలను సోమవారం చైర్మన్ పద్మనాభ రాజు, ఆలయ ఈవోలతలు ప్రారంభించారు. చైర్మన్ మాట్లాడుతూ ఆన్ లైన్‌లో అభిషేకాలు, వసతి గృహాలు, ఈ-హుండీ, డొనేషన్స్, గోశాల, నిత్య అన్నదానం విరాళములు చెల్లించుటకు వీలుగా భక్తుల మొబైల్ ఫోన్లో నుంచి సేవలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది దండపాణి, తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నకు తోడుగా కూటమి ప్రభుత్వం

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** రైతన్నకు తోడుగా నిలిచేది కూటమి ప్రభుత్వమేనని టీడీపీ బిసి విభాగం నాయకులు కొనియాడారు. శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడును సోమవారం నేతలు ఘనంగా సన్మానించారు. పంట ఉత్పత్తుల నాణ్యతను కాపాడటానికి మార్కెట్ యార్డులు, గిడ్డంగులు, నిల్వ సౌకర్యాలు, నాణ్యత పరీక్షా కేంద్రాలు వంటివి ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని చెంచయ్య నాయుడును కోరారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి, మిన్నల్ రవి, మాజీ కౌన్సిలర్ డా.నివేదిత మోరె, డా.యం.ఉమేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమరాల్డ్స్ టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన

విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** తిరుపతి నగర పరిధిలోని నరసింహతీర్థం రోడ్డు మార్గంలో గల ఎమరాల్డ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ కు విశేష స్పందన లభించినట్లు విద్యా సంస్థ డైరెక్టర్లు ఇ.గిరిధర్, కె.విశ్వనాథ్ లు తెలిపారు. తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న 30 పాఠశాలలకు చెందిన వారు ఈ టాలెంట్ టెస్ట్ లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారని చెప్పారు. 10 పాఠశాలలకు చెందిన విద్యార్థులు విజేతలుగా గెలుపొందారన్నారు. గెలుపొందిన విజేతలకు నగదు బహుమతితో పాటుగా రోహిణి అందించి ప్రత్యేకంగా అభినందించమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థ ఉపసంచాలకులు ఎన్.మునిరత్నం, టి.శ్రీనివాసులు, ఎన్.జానకి రామ్, టి. నాదముని పాల్గొన్నారు.

## స్విమ్స్- టిటిడి ప్రాణదాన పథకానికి 1748 మంది పేద రోగుల ఎంపిక

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** స్విమ్స్ టీటీడీ ప్రాణదానానికి 1748 ఎంపికైనట్లు డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి కుమార్ తెలిపారు. స్విమ్స్ డైరెక్టర్ పాత కార్యాలయం, కమిటి హాల్‌లో ఆర్.వి. కుమార్ అధ్యక్షతన సోమవారం ప్రాణదాన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 1748 మంది పేద రోగులను ఉచిత శస్త్ర చికిత్సలకు ఎంపిక చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కార్డియాలజీ-45 మంది, కార్డియో థొరాసిక్-142, ఇ.ఎన్.టి-09, ఎండోక్రైనాలజీ-01, జనరల్ సర్జరి -88, రేడియాలజీ-03, మెడిసిన్- 180, మెడికల్ ఆంకాలజీ -13, న్యూక్లియర్ మెడిసిన్-06, నెఫ్రాలజీ-516, న్యూరాలజి -165, న్యూరో సర్జరీ-240, గైనకాలజి-40, ఆప్తల్మాలజీ-01, సైకియార్టీ-02, రేడియేషన్ ఆంకాలజీ- 22, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రోలజీ-245, సర్జికల్ ఆంకాలజీ-26, యురాలజీ-04, మొత్తం 1748 మంది పేషెంట్లను ఎంపికయ్యారన్నారు. ఈ సమావేశంలో టిటిడి అడిషనల్ ఎఫ్ఎ అండ్ సిఎఓ రవి ప్రసాద్, శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాల డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌కె విద్యా సంస్థల చైర్మన్‌కు అరుదైన గౌరవం

**ప్రజాశక్తి - క్యాంపస్ :** తిరుపతి జిల్లాకు చెందిన ఆర్ కె గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ఫౌండర్, చైర్మన్, ప్రముఖ విద్యావేత్త, సామాజిక సేవాభావం కలిగిన వ్యక్తి డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణ రెడ్డికి అరుదైన గౌరవం లభించింది. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ ద్వారా ఆయనను ఆంధ్రప్రదేశ్ వండర్ బుక్ ఆఫ్ చీఫ్ కో -ఆర్డినేటర్‌గా నియమిస్తూ అధికారిక నియామక పత్రాన్ని ఇండియా చీఫ్ కో ఆర్డినేటర్ డాక్టర్ బింగి నరేంద్ర గౌడ్ అందజేశారు. డాక్టర్ రామకృష్ణ రెడ్డి విద్య, ప్రతిభా వికాసం, యువత శక్తి నిర్మాణం దిశగా చేస్తున్న సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని కల్పించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆయన మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతిభావంతులు అయిన వారి గుర్తించి, వారి విశిష్ట విజయాలను అంతర్జాతీయ వేదికపై నమోదు చేయడం, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ద్వారా ప్రపంచ గుర్తింపు కల్పించడమే లక్ష్యంగా పని చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రంలో విద్యార్థులు, యువత, కళాకారులు, పరిశోధకులు, వినూత్న ప్రతిభ కలిగిన ప్రతి ఒక్కరికీ అంతర్జాతీయ అవకాశాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. విద్యావేత్తలు, అపుస్మా నాయకులు, సామాజిక కార్యకర్తలు, నాయకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు అభిమానులు డాక్టర్ రామకృష్ణ రెడ్డిని అభినందించారు.

## జాతీయస్థాయి పోటీలకు ఎస్పిడబ్ల్యూ జూనియర్ కళాశాల విద్యార్థినులు

**ప్రజాశక్తి - క్యాంపస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెజ్లింగ్, గ్రాప్లింగ్ ఛాంపియన్ షిప్-2025 పోటీలు ప్రకాశం జిల్లా, ఒంగోలు లోని కొత్తపట్నం బీచ్ దగ్గర డిసెంబర్ 12న నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు11మంది, గ్రాప్లింగ్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ని కైవసం చేసుకొని, జాతీయ స్థాయికి ఎస్పిడబ్ల్యూ జూనియర్ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి వెల్లడించారు. కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు విద్యార్థినులను ఫిజికల్ డైరెక్టర్ సాయి సుమతిని అభినందించారు. ఈ పోటీల్లో కె.రెడ్డిజీవన - సీనియర్ హెచ్ఈసీ - బంగారు పతకం - జాతీయ స్థాయికి ఎంపికైంది.ఎస్.అమృత - సీనియర్ సీఈసీ - బంగారు పతకం - జాతీయ స్థాయికి ఎంపికైంది. ఇ.సౌమ్య - సీనియర్ సీఈసీ - బంగారు పతకం - జాతీయ స్థాయికి ఎంపికైంది. ఆర్.దీపిక - సీనియర్ సీఈసీ - బంగారు పతకం - జాతీయ స్థాయికి ఎంపికైంది. ఆర్.లావణ్య - సీనియర్ సీఈసీ - బంగారు పతకం - జాతీయ స్థాయికి ఎంపికైంది. యు.హారిక - జూనియర్ ఎంఈసీ - బంగారు పతకం - జాతీయ స్థాయికి ఎంపికైంది. ఎం.ధాత్రి మొఘధారమ్మ - సీనియర్ హెచ్ఈసీ - రజత పతకం, జి.నిఖిత - జూనియర్ ఎంఈసీ - రజత పతకం దీక్ష - సీనియర్ సీఈసీ - రజత పతకం, ఎన్. గాయత్రి - సీనియర్ సీఈసీ - రజత పతకం, రెడ్డి భావన - సీనియర్ సీఈసీ - రజత పతకాలు సాధించారు.

## త్రో బాల్ విజేతగా పిచ్చాటూరు మహిళా ఉపాధ్యాయులు

**ప్రజాశక్తి - పిచ్చాటూరు:** శ్రీకాళహస్తి డివిజనల్ స్థాయిలో సోమవారం జరిగిన త్రోబాల్ పోటీలో పిచ్చాటూరు మండల మహిళ ఉపాధ్యాయులు విజేతలుగా నిలిచారు. మండల విద్యాశాఖ అధికారులు హేమమాలిని, యుగంధర్ రాజు ఉపాధ్యాయినులను అభినందించారు.

## డ్వాక్రా సంఘాలకు చేయూత

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ :** మహిళల ఆర్థిక వృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌లు పని చేస్తున్నారని, రాష్ట్ర వన్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చెక్కుడుకుప్పం షణ్ముగం రెడ్డి స్పష్టం చేశారు. పుత్తూరు మున్సిపాలిటీ, 1వ వార్డు, పాతపల్లూరులో మెప్మా ఆధ్వర్యంలో, వార్డు పరిధిలోని 51 డ్వాక్రా సంఘాల సర్వ సభ్య సమావేశం మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా షణ్ముగం రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ తమ కుటుంబ అభివృద్ధితో పాటు ఆర్థికంగా పునరాభివృద్ధి చెందడానికి డ్వాక్రా సంఘాలే ముఖ్య కారణమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్, సి.ఈ.ఓ లావణ్య, నాయకులు లక్ష్మీపతి, మురగేశ్ రెడ్డి, మహేష్, గణేష్, మనీ, కుప్పారెడ్డి, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## మార్కెట్‌లోకి "స్మైల్ ఎకో" ఉత్పత్తులు

**ప్రజాశక్తి-వరదయ్యపాలెం:** శ్రీసిటీలోని స్మైల్ ఎకో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉత్పత్తులను సోమవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. కంపెనీ యండి మల్లికార్జున పరుచూరి సమక్షంలో శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్సార్) నిరీషా సన్నారెడ్డి లాంఛనంగా ఉత్పత్తుల వాహనాన్ని తరలించారు. వ్యక్తిగత పరిశుభ్రత ఉత్పత్తులు (శానిటరీ న్యాప్‌కిన్స్) తయారు చేసే ఈ కంపెనీ ఈ సంవత్సరంలో ప్రారంభమై శరవేగంగా ఉత్పత్తులు మొదలుపెట్టి సుమారు 10 లక్షల రూపాయల విలువచేసే తొలి ఉత్పత్తులను విజయవాడకు పంపింది. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ, వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ఉత్పత్తులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. దీంతో వాణిజ్య కార్యకలాపాలకు శ్రీకారం చుట్టామని, రాబోయే రోజుల్లో మరిన్ని కొత్త ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. శ్రీసిటీలో అనుకూల పారిశ్రామిక వాతావరణం, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ మద్దతు తమ వ్యాపార అభివృద్ధిలో కీలకంగా నిలిచాయన్నారు. స్మైల్ ఎకో ఎండీ, సిబ్బందికి నిరీషా సన్నారెడ్డి అభినందనలు తెలిపారు. స్థానికుడు, శ్రీసిటీ ఉద్యోగి నుంచి పారిశ్రామికవేత్తగా మల్లికార్జున పయనం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. స్థానిక యువతకు మరింత ఉపాధి కల్పించే దిశగా కంపెనీ ఇంకా వృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

## దర్శ ఇండస్ట్రీస్‌ను ప్రారంభించిన తుడా చైర్మన్

**ప్రజాశక్తి - చంద్రగిరి:** చంద్రగిరి మండలం, నాగయ్యగారిపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో నూతనంగా ఏర్పాటు చేసిన దర్శ ఇండస్ట్రీస్ ను తుడా చైర్మన్, టిటిడి ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఆయనకు ఇండస్ట్రీస్ నిర్వాహకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికి సత్కరించారు.

## మెగా రక్తదాన శిబిరం విజయవంతం

**ప్రజాశక్తి - నాయుడుపేట:** శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా మేమున్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాయుడుపేట అంబేద్కర్ భవన్లో సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో దాతలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేశారు. రక్తం దానం చేసిన వారు దేవునితో సమానమని సివి రామన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గాది రెడ్డి గోపి పేర్కొన్నారు. అమరావతి గెస్ట్ ఇన్ సౌజన్యంతో పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడుపేట సిహెచ్ సి మెడికల్ ఆఫీసర్ అమర్నాథ్, మేమున్నాం ఫౌండేషన్ వ్యవస్థాపకులు కూరాకు గోపి, టిడిపి నాయకులు పొట్లపూడి రాజేష్, లాయర్ కుమార్, ప్రభాస్ యువసేన యోగి తదితరులు పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట హెచ్.డి.ఎఫ్.సి బ్యాంకు సిబ్బంది, ప్రభుత్వ డిగ్రీ కళాశాల యన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్ , సివి రామన్ డిగ్రీ కళాశాల,విక్రమ్ కళాశాల విద్యార్థులు ఫౌండేషన్ సభ్యులు అద్విక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు

**ప్రజాశక్తి - రేణిగుంట:** కృష్ణాపురం రెవెన్యూ గ్రామం సర్వే నెం. 98 లోని కారకంబాడి రోడ్డుపక్కన, టూరిజం స్థలం సమీపంలో ఉన్న రాళ్లకల్వ - మల్లెమడుగు ప్రాంతంలో, ప్రభుత్వ భూమి ఆక్రమణను రెవెన్యూ అధికారులు గుర్తించారు. సోమవారం ఆక్రమిత ప్రభుత్వ భూమిని పూర్తిగా ఖాళీ చేయించి, నిబంధనల ప్రకారం ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## సిఆర్ఎస్‌లో పెన్షన్ అదాలత్

**ప్రజాశక్తి - రేణిగుంట :** నేషనల్ పెన్షన్ అదాలత్ 2025 కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక రైల్వే ఇన్స్టిట్యూట్లో పెన్షన్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డబ్ల్యూపిఓ శ్రీనివాస్ నాయక్, ఏఐఆర్ఎఫ్ సిఆర్ఎస్ పెన్షనర్స్ సంఘం సెక్రటరీ విజయ్ కుమార్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎంఈ ప్రమోద్, సీనియర్ డిఎంఓ హిమజా భాయ్, డిప్యూటీ సీఎంఎం సత్య ప్రకాష్, ఏడబ్ల్యూఏఓ గోపాల్ నాయక్, ఏడిఈఈ రాజమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డబ్ల్యూపిఓ శ్రీనివాస నాయక్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 15వ తేదీన నేషనల్ పెన్షన్ అదాలత్ కార్యక్రమం నిర్వహించుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ నాయకులు, ఆఫీస్ సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## త్రోబాల్ పోటీలో తిరుపతి అర్బన్ మండలం విజేత

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** స్థానిక తారక రామా స్టేడియంలో మహిళా ఉపాధ్యాయులకు సోమవారం మండల స్థాయిలో నిర్వహించిన త్రోబాల్ పోటీల్లో తిరుపతి అర్బన్ మండలం జట్టు, చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి మండలాలతో గెలిచి ఫైనల్స్‌లో ఎర్రావారిపాలెం మండలం టీంతో గెలిచి విజేతగా నిలచింది. దీంతో తిరుపతి డివిజన్‌తో ఆడడానికి స్థానం సంపాదించింది. అర్బన్ మహిళా ప్రభుత్వాల టీమును తిరుపతి అర్బన్ మండల విద్యాశాఖ అధికారులు బాలాజీ, భాస్కర్ నాయక్, ఇతర మండలాల ఎంఈఓలు విజేతలను అభినందించారు.

## విద్యార్థుల ఉన్నతికి స్కౌట్ మాస్టర్లు కృషి చేయాలి

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** చిన్నతనం నుండి విద్యార్థులను ఉన్నత శిఖరాలు అధిరోహించేలా స్కౌట్ మాస్టర్లు కృషి చేయాలని ఎంఇఓ బాలయ్య కోరారు. శ్రీకాళహస్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్ మాస్టర్ బేసిక్ క్యాంపును సోమవారం ఎంఈఓ బాలయ్య ప్రారంభించారు. ఈ క్యాంపుకు జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుండి 30 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు.

## ఆధార్ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

సచివాలయాల పనితీరుపై సమీక్షిస్తున్న జిఎస్ డబ్ల్యూఎస్ జిల్లా అధికారి నారాయణరెడ్డి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నామని, తిరుపతి జిల్లాలోని విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లల ఆధార్ అప్డేషన్, బయోమెట్రిక్ వంటివి అప్డేట్ చేసుకోవడానికి ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించడం జరుగుతోందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి జీవి నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. తిరుపతి జిల్లాలో నవంబర్ నెలలో నిర్వహించిన ఆధార ప్రత్యేక శిబిరాల కొనసాగింపుగా గ్రామ వార్డు సచివాలయ విభాగం పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. తిరుపతి జిల్లాలో మొత్తం 86,141 మంది పిల్లలు ఉన్నారని, ప్రత్యేక ఆధార్ శిబిరాల ద్వారా ఆధార్ బయోమెట్రిక్ చేసుకున్నవారు 11796 మంది విద్యార్థులు మాత్రమే బయోమెట్రిక్ అప్డేట్ చేసుకున్నారని, మిగిలినవారు బయోమెట్రిక్ అప్డేట్ చేసుకోలేదన్నారు. ఈనెల 16 నుంచి 20 వరకు 22 నుంచి 24వరకు విద్యార్థుల కోసం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర సూచనల మేరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసామన్నారు.

## రోటరీ క్లబ్ సభ్యులకు సన్మానం

**ప్రజాశక్తి - నాయుడుపేట:** నాయుడుపేట రోటరీ క్లబ్ సభ్యులను కైలాస కోనకు ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి పరసారత్నం హాజరయ్యారు. కైలాస కోన ఆలయ చైర్మన్ బాలచంద్ర నాయుడు, నాయుడుపేట రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ నాగూరయ్య, సెక్రటరీ సుబ్రహ్మణ్యం, సభ్యులను సన్మానించారు. సింగిరికోన నరసింహస్వామి ఆలయ చైర్మన్ గిరి ముదిరాజ్, నాయుడుపేట రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ నాగూరయ్య, సెక్రటరీ సుబ్రహ్మణ్యం, రోటరీ క్లబ్ సభ్యులను ప్రత్యేకంగా ఆహ్వానించి స్వామివారి చిత్రపటాలను అందించారు. ఈ సందర్భంగా నాయుడుపేట రోటరీ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ తమ సేవా కార్యక్రమాలను గుర్తించి సత్కరించడం సంతోషంగా ఉదన్నారు. మాజీ మంత్రి పదసారత్నం మాట్లాడుతూ నాయుడుపేట రోటరీ క్లబ్ వారు అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలు ప్రముఖుల మన్ననలు పొందుతున్నారన్నారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ నాగురయ్య మాట్లాడుతూ మమ్మల్ని ప్రత్యేకంగా ఆహ్వానించి సన్మానించడం ఆనందదాయకమన్నారు. మాజీమంత్రి పరసారత్నం, కైలాస కోన ఆలయ చైర్మన్ బాలచంద్ర నాయుడు, సింగిరి కోన నరసింహస్వామి ఆలయ చైర్మన్ గిరి ముదిరాజ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## పోటా పోటీగా ఐఐటిలో క్రీడలు

**ప్రజాశక్తి -ఏర్పేడు :** ఐఐటి తిరుపతిలో జరుగుతున్న 58వ ఇంటర్ ఐఐటి క్రీడా పోటీల రెండవ రోజున వివిధ విభాగాలలో తీవ్రమైన పోటీ నెలకొంది. టెన్నిస్ లీగ్‌లు, చదరంగం మ్యాచ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఐఐటి కాన్పూర్ అగ్రస్థానంలో చదరంగం పోటీలో, మొదటి రౌండ్ తర్వాత ఐఐటి కాన్పూర్ 4 పాయింట్లతో ముందంజలో నిలిచింది. ఐఐటి మద్రాస్, ఐఐటి ఖరగ్‌పూర్, ఐఐటి గౌహతి 3.5 పాయింట్లతో దగ్గరగా ఉన్నాయి. 60 కిలోల విభాగంలో గ్రూప్ ఏ, బి, 65 కిలోల గ్రూప్ బి విభాగాలలో వెయిట్‌లిఫ్టింగ్ ఈవెంట్‌లు జరిగాయి. లిఫ్టర్లు స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్ విభాగాలలో పోటీపడ్డారు. 60 కిలోల విభాగం గ్రూప్ బి లో మొదటి స్థానం పీయూష్ టైలర్ ( ఐఐటి బొంబాయి ) 2వ స్థానం హరిచంద్ర ప్రసాద్ ( ఐఐటి ఖరగ్‌పూర్ ) 3వ స్థానంలో డేవిడ్ ప్రతాప్ సింగ్ ( ఐఐటి పాట్నా) 65 కిలోల విభాగం గ్రూప్ బి లో మొదటి స్థానం నిఖిలేష్ సింగ్ బిష్ట్ (ఐఐటి బొంబాయి ) 2వ స్థానం ఆకాష్ పిబి ( ఐఐటి మద్రాస్ ) 3వ స్థానంలో శ్రీమాన్ గోవిందు (ఐఐటి గాంధీనగర్ ) ఇతర ఫైనలిస్టులు ఖరగ్‌పూర్, ఢిల్లీ, జోధ్‌పూర్, ధన్‌బాద్, ఇండోర్, తిరుపతి, వారణాసి, కాన్పూర్ మరియు గౌహతి ఐఐటీల కంటెంజెంట్లు ప్రాతినిధ్యం వహించారు. 60 కిలోల కేటగిరీలో గ్రూప్ ఏ లో మొదటి స్థానంలో మువాన్నా న్లీయన్ నౌలక్ ( ఐఐటి రూర్కి) 2వ స్థానంలో ఉజ్జల్ దాస్ ( ఐఐటీ రోపర్) 3వ స్థానంలో సుమిత్ షిర్వా (ఐఐటి ఖరగ్పూర్ ) నిలిచారు.

## కోటి సంతకాలపై చర్చలకు సిద్ధమా..?

**ప్రజాశక్తి - చంద్రగిరి:** మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వగ్రామంలో ప్రజలు 500 సంతకాలు చేసినట్లు వైసిపి చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మోసపూరిత, అసత్య, ఆరోపణలతో కూడిన ప్రచారాలు చేసుకోవడం సిగ్గుచేటని చంద్రగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ గౌస్ బాషా అన్నారు. సోమవారం నారావారిపల్లి, ఎన్టీఆర్ విగ్రహం వద్ద మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామస్తులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోహిత్ రెడ్డికి దమ్ముంటే నారావారిపల్లెలో ప్రజలు పెట్టిన సంతకాలతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. సంతకాలతో వైసిపి డ్రామాలు ఆడుతున్నదని ధ్వజమెత్తారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ జెడ్పిటిసి రమేష్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఏ.జి.పల్లి బాల ఏఎంసీ చైర్మన్ గౌస్ బాషా, కందుల వారి పల్లి సర్పంచ్ లక్ష్మితదితర నాయకులు పాల్గొన్నారు.

## వాకర్స్‌కు డైరీలు పంపిణీ

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** తిరుపతి తిరుమల బైపాస్ రోడ్డులోని ప్రకాశం మునిసిపల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్, రెప్కో బ్యాంక్ ఆధ్వర్యంలో 300 మంది వాకర్ సభ్యులకు ఉచితంగా 2026 నూతన సంవత్సర డైరీలను రెప్కో బ్యాంకు మేనేజర్ దీపిక, వాకర్స్ ఇంటర్నేషనల్ రీజినల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం మునిసిపల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోపినాథ్, కార్యదర్శి చంద్రకాంత్ , కోశాధికారి గురునాథం తదితర సభ్యులు పాల్గొన్నారు.

## నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకోండి : ఎంపీ

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** నకిలీ పాన్, ఆధార్ పత్రాలు ఉపయోగించి సృష్టిస్తున్న నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్లపై తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మద్దిల గురుమూర్తి లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖను ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాదనం ఇచ్చారు. గత మూడు సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్లు వెలుగుచూశాయని, వీటి ద్వారా భారీగా పన్ను ఎగవేత జరిగిందని తన సమాధానంలో అంగీకరించారు. ఈ వ్యవహారాల్లో ఇప్పటివరకు 133 మందిని అరెస్ట్ చేసి, 94 కేసుల్లో అభియోగాలు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ, నకిలీ జీఎస్టీ రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం జరుగుతోందని, ఇలాంటి మోసాలకు కఠిన శిక్షలు, వేగవంతమైన విచారణ, పన్ను నష్టం పూర్తిగా రికవరీ చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** వైసీపీ హయాంలో ప్రతి జిల్లాలో ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేశారని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి పేర్కొన్నారు. పార్లమెంటు ఆవరణలో వైసీపీ ఎంపీలు మెడికల్ కాలేజీల ఉద్యమ చిత్రాలను చూపుతూ నిరసన తెలిపారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడాతూ ప్రతి మెడికల్ కాలేజీకి అనుబంధంగా 500 పడకల ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ విభాగాలు, పారామెడికల్ కోర్సులు కూడా ప్రారంభించేలా సమగ్రంగా మౌలిక వసతులు కల్పించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. కేంద్ర ఆర్థిక మంత్రిని కలిసి ఈ అంశాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్ళి, ప్రైవేటీకరణ చర్యలను ఆపాలని కోరామన్నారు.

**V Judge**
**BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT CHENNAI**
**M.C.O.P.No. 2942 of 2025**

Ragava ....Petitioner.

-Versus-

1. Chandrasekhar
2. M/s The New India Assurance.Ltd.

...Respondents

To
Mr. S.Chandrasekhar,
S/o. S.Munuswamy Reddy,
DNp.5-30, Kotha Thimma Puram,
Puttur, Tirupathi District,
Andhra Pradesh-517583.

...1st Respondent.

Please take notice that the above M.C.O.P.No.2942 of 2025 is posted for your appearance before the Hon'ble V court on 05.01.2026 at about 10.30 A.M., Please be present before the above said Court on that day, failing which the matter will be decided in your absence.

**Mr. R. Arumainayagam,**
**Counsel for petitioner**

**మహారాజశ్రీ గౌరవనీయులైన వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**I.A.No.630 /2025**
**O.S.No.180/2015**

గిద్దలూరు సులోచనమ్మ(Died)
....పిటీషనర్లు/వాదులు
గిద్దలూరు రాధాకృష్ణారెడ్డి మరియు ఇద్దరు

**V/S**

గిద్దలూరు పోలమ్మ మరియు ఇద్దరు
...రెస్పాండెంట్/ప్రతివాదులు

To.
గిద్దలూరు పోలమ్మ,
భర్త వెంకటసుబ్బారెడ్డి, వెందోడు గ్రామం, గూడూరు రూరల్ మండలం, నెల్లూరుజిల్లా.

**నోటీసు**

పై కోర్టులో కేసులకు సంబంధించిన కాగితములు స్వీకరించమని కోరుతూ పిటీషనర్లు పై నెంబరుగల పిటీషను వేసినందువలన మీ నోటీసు నిమిత్తం 16-12-2025తేది నాటికి వాయిదావేసి ఉన్నారు. కావున మేము స్వతహాగా కానీ, వకీలు ద్వారా కాని పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలియచేయగలరు లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించడం జరుగుతుంది. వాయిదా తేది. 16-12-2025

ఇట్లు
**తాయి విజయకుమార్,** బి.ఎ.,బి.ఎల్.,
**వాదితరఫున న్యాయవాది**
**సెల్-9030837221**

# క్రైం న్యూస్

## వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాశక్తి - గూడూరు టౌన్ :** గూడూరు రూరల్ పరిధి, చల్లకాలువ సమీపంలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో సోమవారం ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు, ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఓ వ్యక్తి మృతిచెందివుండటాన్ని స్థానికులు గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారన్నారు. సంఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించగా కోట మండలం, నెల్లూరు కొత్తపాళెం గ్రామానికి చెందిన సుబ్బయ్య(48) అనే వ్యక్తి వరికోత మిషన్ వద్ద పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు విచారణలో తెలియాల్సివుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తిరుపతయ్య తెలిపారు.

## కారును ఢీకొన్న మెట్రో బస్సు

**ప్రజాశక్తి - రేణిగుంట :** తిరుపతి నుండి శ్రీకాళహస్తి వెళ్తున్న ఆర్టీసీ మెట్రో బస్సు, రేణిగుంట ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో సోమవారం ముందు వెళ్తున్న కారును వేగంగా ఢీకొట్టడంతో ముందున్న ద్విచక్ర వాహన మెకానిక్ షాపు వద్ద ఆగి ఉన్న వాహనాలను.. ఆ కారు ఢీ కొట్టింది. మెట్రో బస్సు బ్రేకులు పనిచేయకపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని సమాచారం. ఆ సమయంలో రద్దీ లేని కారణంగా పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణ నష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.

## రైళ్లల్లో చోరీకి పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

**ప్రజాశక్తి - రేణిగుంట:** ఇటీవల కాలంలో రైళ్లల్లో దొంగతనానికి పాల్పడుతున్న వ్యక్తిని సోమవారం రేణిగుంట జిఆర్పి పోలీసులు అదుపులో తీసుకున్నారు ఈ సందర్భంగా జిఆర్పి ఎస్ఐ మధుసూదన్ రావు మాట్లాడుతూ డిఎస్ఆర్పి హర్షిత రేణిగుంట ఆర్ పి ఐ యతేంద్ర ఆదేశాల మేరకు గత కొంతకాలంగా రైళ్లల్లో చోరీకి పాల్పడుతున్న ఇతనిని అదుపులోనికి తీసుకొని విచారించగా తన పేరు లోకేష్ కుమార్ 36 సంవత్సరాలు తండ్రి కేశవులు నివాసం ఎర్నాపూర్ చెన్నై తమిళనాడులో నివాసముంటున్నట్టు విచారణలో తెలిపాడు. ఇతను గత కొంతకాలంగా చెడు వ్యసనాలకు అలవాటై సులభంగా డబ్బు సంపాదన దేశంతో రైళ్లల్లో నిద్రలో ఉన్న ప్రయాణికుల వద్ద నుండి బంగారు ఆభరణాలు నగలు దొంగలించినట్లు అంగీకంచాడని తెలిపారు. ఇతని వద్ద నుండి సుమారు 91 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ సుమారు తొమ్మిది లక్షల పదివేల రూపాయలు ఉంటుందని రేణిగుంట జిఆర్పిఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు. ఇతని అరెస్టు చేసి రిమాండ్‌కి పంపినట్లు తెలిపారు. ఇతని పట్టుకునే దానికి వ్యవహరించిన ధర్మేంద్ర రాజు అలాగే గురుమూర్తి ఏలుమలై అంజి బాబు గణేష్ కుమారులు అభినందించారు.

## బైకులకు నిప్పంటించిన ఉన్మాది

**ప్రజాశక్తి - చంద్రగిరి:** చంద్రగిరి మండలం, తొండవాడ వద్ద కిరాణా దుకాణం నిర్వహిస్తున్న దంపతులపై గంజాయి మత్తులో ఓ యువకుడు కత్తితో దాడికి యత్నించాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో యువకుడు సోమవారం తెల్లవారు జామున దంపతులకు చెందిన రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టిన ఘటన మండల పరిధిలోని తొండవాడ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. తొండవాడ గ్రామంలో మహేంద్రరెడ్డి, సంధ్య దంపతులు కిరాణా దుకాణం పెట్టుకుని జీవిస్తున్నారు. ఆదివారం సాయంత్రం పిచ్చినాయుడుపల్లికి చెందిన గౌతమ్ కుమార్ (పెప్సీ) అనే యువకుడు మత్తులో కిరాణా దుకాణం నడుపుతున్న సంధ్య, ఆమె భర్త హేమేంద్రరెడ్డిలపై కత్తితో దాడికి యత్నించాడు. ఈ క్రమంలో సంధ్య చంద్రగిరి పోలీసు స్టేషన్ చేరుకుని జరిగిన సంఘటనపై ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని మత్తులో ఉన్న గౌతమ్ కుమార్(పెప్సీ)ని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి మందలించి పంపివేశారు. దీనిపై కక్షకట్టిన గౌతమ్ కుమార్ సోమవారం వేకువజామున మహేంద్రరెడ్డి ఇంటి ఆవరణలో ఉంచిన రెండు ద్విచక్రవాహనాలపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. ప్రమాదంలో ఇంటికి అమర్చిన విద్యుత్తు వైర్లుసైతం కాలిపోవడంతో ప్రాణభయంతో ఇంటిలోని వారు బయటకు పరుగులు తీశారు. దీనిపై బాధితులు మరో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందుతుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా చంద్రగిరి మండలంలో ఇటీవల గంజాయి బ్యాచ్ రెచ్చిపోతోంది. రైతుల పొలాల్లో గంజాయి సేవించడం, రాత్రుల్లో పట్టణంలో తిరుగుతూ దాడులు చేసి నగదు లాకెళ్లడం జరుగుతున్నాయి. గంజాయి బ్యాచ్ ఆగడాలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు లోనవుతున్నారు. గంజాయి బ్యాచ్ ను నియంత్రించాలని ప్రజలు పోలీసు శాఖను కోరుతున్నారు.

**In the Court of the Senior Civil Judge : Gudur**
**I.A.No. 258 / 2019**
**O.S.No. 182 / 2010**

**1. Nelamalli Kasthuraiah**
**2. Muchakalla Pullamma**

- Petitioners / Plaintiffs

Vs

**1. Nelamalli Masthanamma**
and another - Respondents / Defendants

**Notice**

To,
**R1. Nelamalli Masthanamma,**
W/o **Chengaiah,**
**R2. Atla Sumathi,** W/o **Chengaiah,**
R1 & R2 are residing at Janakirampet, Gudur Town, SPSR Nellore District.

పై నెంబరున పిటిషనర్లు/వాదులు డిస్మిసల్ ఆర్డర్‌ని సెటసైడ్ చేయమని పిటిషన్ వేయడంలో ఆలస్యమైనందున ఆలస్యాన్ని మన్నించమని కోరుతూ పై తెలిపిన కోర్టులో సెక్షన్ 5 ఆఫ్ లిమిటేషన్ యాక్ట్ ప్రకారం పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే23-12-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకో వలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

**బి.బాలప్రదీప్,** ఎం.బి.ఎ., ఎల్.ఎల్.ఎం.,
పిటిషనర్లు / వాదుల తరపు అడ్వకేట్, గూడూరు.

## నాగలాపురం పోలీసు స్టేషన్ తనిఖీ

**ప్రజాశక్తి-నాగలాపురం:**స్థానిక పోలీసు స్టేషన్లో సోమవారం పుత్తూరు డీఎస్పీ రవి కుమార్ వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో బాగంగా డీఎస్పి రవి కుమార్ పోలీసు స్టేషన్ పరిసరాలను, భవనములను పరిశీలించారు.అనంతరం గంజాయి రవాణా వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి గంజాయి కట్టడకి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్ఐ కు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు సీఐ ఎం. మురళి నాయుడు, ఎస్ఐ సునీల్, ఏస్ఐ రవి, షణ్ముగం, తోటి సిబ్బంది పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశి భద్రతా ఏర్పాట్లపై సమీక్ష

**ప్రజాశక్తి - తిరుమల:** డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది వరకు నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శనాల భద్రత ఏర్పాట్లపై టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ సీవీఎస్వో మురళీకృష్ణలతో కలిసి టీటీడీ, పోలీసు ఉన్నతాధికారులతో తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో సోమవారం సాయంత్రం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వైకుంఠ ద్వార దర్శనాల భద్రతా ఏర్పాట్లపై మూడు గంటల పాటు క్షేత్రస్థాయిలో చర్చించారు.ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని తిరుమలలో భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వైకుంఠ ద్వార దర్శనాల్లో డిసెంబర్ 30, 31, జనవరి 1వ తేదీల్లో లక్కీ డిప్ ద్వారా టోకెన్ పొందిన భక్తులను మాత్రమే దర్శనాలకు అనుమతి ఉంటుందని, టోకెన్ లేని భక్తులకు జనవరి 2 నుండి 8వ తేది వరకు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -2 ద్వారా నేరుగా సర్వ దర్శనాలకు రావచ్చని భక్తులకు అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు.తిరుపతి రైల్వే స్టేషన్, బస్టాండ్, శ్రీనివాసం, విష్ణు నివాసం, అలిపిరి, శ్రీవారి మెట్టు ప్రాంతాల్లో భక్తులకు తెలిసే విధంగా రేడియోబ్రాడ్ కాస్టింగ్, సోషియల్ మీడియా, ఎస్వీబీసీ, ఇతర మాధ్యమాల ద్వారా భక్తులకు అవగాహన కల్పించేందుకు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. వైకుంఠ ద్వార దర్శన రోజుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని విభాగాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని భక్తులకు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైకుంఠ ఏకాదశి ముందురోజు సాయంత్రం నుండి భక్తులకు అన్న పానీయాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని అన్న ప్రసాద విభాగం అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా సేవలు అందించేందుకు అవసరమైన సంఖ్యలో శ్రీవారి సేవకులను అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ వైకుంఠ ద్వార దర్శనాలపై భక్తుల్లో ఎలాంటి అయోమయం తలెత్తకుండా టీటీడీ తీసుకున్న నిర్ణయాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల తరహాలో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసి భద్రతను పర్యవేక్షించేందుకు చర్యలు తీసుకునేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. టీటీడీ, పోలీసు అధికారులతో వాట్సాప్ గ్రూప్ రూపొందించి ఎప్పటికప్పుడు సమస్యలపై తక్షణం స్పందించేలా సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో టీటీడీ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఫణి కుమార్, సీఈ సత్య నారాయణ, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, ఇతర టీటీడీ, పోలీసు, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక భద్రతకు జీవనజ్యోతి

**ప్రజాశక్తి-ఏర్పేడు:** కేంద్ర ప్రభుత్వం, భీమాసంస్థలు ప్రజలకు రక్షణ కల్పించడంతో పాటు వారి భవితకు, ఆర్థికభద్రతకు ఎంతగానో దోహద పడుతున్నాయని, కావున ప్రజలు ఆయా భీమాపథకాలను సద్వినియోగం చేసుకుంటే ఎన్నో ఆర్థిక ప్రయోజనాలు చేకూరుతాయని పాపానాయుడుపేట ఏపీ గ్రామీణ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ భార్గవ్ రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల మండలంలోని పాపనాయుడుపేటలో మురళి అనే వ్యక్తి అనారోగ్యంతో మరణించడంతో నామినీ అయినా అతడి భార్య దివ్యకు 2 లక్షల రూపాయలు ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన పథకం కింద అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడ్స్ సిఎఫ్ఎల్ క్లస్టర్ కో ఆర్డినేటర్ కె. చెంచయ్య, ఏర్పేడు సి ఎఫ్ ఎల్ కౌన్సిలర్స్ సుప్రియ మరియు వినోద్ కుమార్ పాల్గొన్నారు.

## భూసారాన్ని కాపాడుకుందాం

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** నారాయణవనం, గ్రామ స్థాయి ప్రకృతి వ్యవసాయ రైతు సంస్థలను అందరు రైతుల సమన్వయంతో నిర్జీవమైన భూమిని జీవమైన భూమిగా మార్చి అభివృద్ధి సాధిద్దామని సెర్ప్ సహాయ ప్రాజెక్ట్ అధికారి టి.ధనంజయ రెడ్డి తెలిపారు. నారాయణవనం, మండల మహిళా సమాఖ్యలో సోమవారం వ్యవసాయ అనుబంధశాఖల ఉద్యోగులు, ఎంఎస్ కార్యవర్గ సభ్యులు, విఓఏలకు జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ లక్ష్యాలపై సమన్వయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లను, ఖర్చులను తగ్గించి ఆరోగ్యకరమైన పంటలు పండిచేందుకు నిర్జీవమైన భూమిని, జీవమైన భూమిగా మార్చే విధానాలు మహిళా రైతు సంఘాల సభ్యులు చేపట్టాలని అవగాహన కల్పించారు.

## ప్రయోగశాల పరికరాలపై అవగాహన పెంచుకోవాలి

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నుంచి వారం రోజులపాటు ల్యాబ్ మెటీరియల్ పై శిక్షణ కార్యక్రమం సెనేట్ హాల్లో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఆచార్య విజయభాస్కరరావు మాట్లాడుతూ ఎంతో విలువైన పరికరాలు పనికి రాకుండా పోతే వాటిని మరమ్మత్తుకు ఇస్తే సకాలంలో తిరిగి ఇవ్వక పరిశోధనలు కుంటు పడే అవకాశం ఉంటుందన్నారు. ఇందువల్ల పరికరాలను మరమ్మత్తు చేసుకోవడం గురించి పరిశోధకులకు అవగాహన అవసరం అన్నారు. ముంబైలోని వెస్టర్న్ రీజినల్ ఇన్స్టుమెంటేషన్ సెంటర్ సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏ పరికరాన్ని అయినా క్షుణ్ణంగా తెలుసుకున్నప్పుడే పరిశోధకులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమం కో-ఆర్డినేటర్ ఆచార్య దేవ ప్రసాదరాజు, ఆచార్య హేమ తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు అవగాహన

**ప్రజాశక్తి -దొరవారిసత్రం:** దొరవారిసత్రం మండల పరిధిలోని పోలిరెడ్డిపాలెం, తల్లంపాడు గ్రామాలలో సోమవారం జిల్లా వనరుల కేంద్రం వారి ఆధ్వర్యంలో భూసార పరీక్ష ఫలితాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి శ్రీనివాసులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకం ద్వారా రైతులకు సాగు ఖర్చు తగ్గడమే కాక ఆహార భద్రతను ఆరోగ్య భద్రతను కలిగిస్తాయని తెలియజేశారు. ఖరీఫ్‌లో రైతులు తమ పొలాల్లోని మట్టిని రైతు సేవా కేంద్రాల ద్వారా భూసార పరీక్షకు పంపిన వారందరూ తమకు సంబంధించిన రైతు సేవా కేంద్రాల నుండి తమ యొక్క భూసార పరీక్ష ఫలితాల కార్డులను తప్పక తీసుకొని వాటి ఆధారంగానే ఎరువులను ఎరువుల వాడకం మరియు యాజమాన్య పద్ధతులను చేపట్టాలని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో వ్యసాయ అధికారులు,వేణుగోపాల్, జ్యోతిర్మయి, మండల రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములుకు నివాళి

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :** పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటంవద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మన్యం నరసింహులు, కన్వీనర్ ఎ. నాగేశ్వరరావు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుజన, అధ్యాపకులు ఎస్.పద్మావతి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - వాకాడు:**వాకాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు ఎంపీడీవో సాయి ప్రసాద్, తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్‌లు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** పొట్టి శ్రీరాములు చేసిన ఆత్మ త్యాగం ఎంతో గొప్పదని తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. ఎం.శ్యాంబాబు పేర్కొన్నారు. సోమవారం ఆర్‌సి రోడ్ లోని ఈఎస్ఐ. ఆసుపత్రిలో శ్యాంబాబు ఆధ్వర్యంలో శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగాన్ని గుర్తు చేస్తూ డాక్టర్లు, సిబ్బంది నివాళి అర్పించారు. ఈ. కార్యక్రమంలో ఆర్ఎంఓ. డాక్టర్. ఏ.వి.ఎస్. ప్రసాద్, స్పెషలిస్ట్ డాక్టర్. వెంకయ్య, కె. పద్మావతి, ఇతర డాక్టర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటం

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** తిరపతి అర్బన్, కొరమేనుగుంటలో గిరిజనులు నివాసమున్న దేముడు కాలనీకి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తిరుపతి నగర సమితి ఆధ్వర్యంలో రిలే నిరవధిక నిరసన దీక్ష కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో ఎరుకుల, యానాది కులస్తులు చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, మౌలిక వసతులు కూడా లేని పరిస్థితిలో వారి జీవిస్తున్నారని తెలిపారు. గిరిజనులకు ఇచ్చిన ప్రభుత్వ భూములపై పెద్దల కన్ను పడిందని, అధికారులతో కుమ్మక్కై వారి ఇళ్ళను కూలగొడితే భారత సిపిఐ ఆధ్వర్యంలో పోరాటం చేసి కాపాడమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్, నగర కార్యవర్గ సభ్యులు, ఎన్ శివ, పద్మనాభ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డివిజనల్ స్థాయి క్రికెట్ మ్యాచ్ లో ఏర్పేడు జట్టు విజయం

**ప్రజాశక్తి -ఏర్పేడు :** ఏపీ ప్రభుత్వం ఉపాధ్యాయులకు నిర్దేశించిన క్రికెట్ క్రీడలో భాగంగా సోమవారం శ్రీకాళహస్తి గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ మైదానంలో జరిగిన డివిజన్ స్థాయి క్రికెట్ మ్యాచ్లో బి యన్ కండ్రిగ జట్టుపై ఏర్పేడు జట్టు విజయం సాధించింది. బీ. ఎన్. కండ్రిగ జట్టు 12 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 92 పరుగులు, ఏర్పేడు జట్టు రెండు వికెట్లు కోల్పోయి 93 పరుగులతో లక్ష్యం సాధించింది. విజయం సాధించిన ఏర్పేడు క్రికెట్ టీం ను మండల విద్యా శాఖధికారులు ప్రేమలత, దయాకర్ రావులు అభినందించింది.

## సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలి

**ప్రజాశక్తి - క్యాంపస్ :** సమాజంలో ప్రధాన ఆధారమైన రైతుకు వ్యవసాయం, వెటర్నరీ అనుసంధానంతో తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం వచ్చే విధంగా సరికొత్త ఆలోచనలకు శాస్త్రవేత్తలు రూపునివ్వాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య శారద జయలక్ష్మి పిలుపునిచ్చారు. తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏఎన్జిఆర్ఏయు పోషన్ ఇంక్యూబేటర్ లో సోమవారం 8వ బ్యాచ్ శిక్షణ కార్యక్రమాని సోమవారం శంకర్ రెడ్డి సెమినార్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమ ముఖ్య అతిథి ఆచార్య ఎన్. జి. రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం, గుంటూరు, ఇంచార్జీ విసి డా. ఆర్. శారదా జయలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత సమాజానికి అనుగుణమైన రైతులకు సంబంధించిన పరికరాలను ఉత్పత్తులను సరికొత్త ఆలోచనతో తక్కువ వ్యయంతో అధిక లాభాన్ని పొందే విధంగా తమ ఆలోచనలకు రూపుని ఇవ్వాలని శిక్షకులకు పిలుపునిచ్చారు.

## సప్తగిరుల ప్రదక్షిణకు టీటీడీ చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వెలిసిన తిరుమల సప్తగిరుల ప్రదక్షిణకు భక్తులకు అవకాశం కల్పించేందుకు టీటీడీ చర్యలు తీసుకోవాలని శ్రీవారి సేవకులు అసోసియేషన్ కార్యదర్శి దిండుకుర్తి నరసింహులు విజ్ఞప్తి చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తిరుమలకు వచ్చే భక్తకోటికి సప్తగిరుల ప్రదక్షిణ చేసుకునే అవకాశం కల్పిస్తే ఎంతో పుణ్యఫలమని అన్నారు. తాము ఒక బృందంగా తిరుమల సప్తగిరుల ప్రదక్షిణ చేపట్టామని, సప్తగిరుల చుట్టూ అనేక చారిత్రక పురాణ ఆలయాలు ఉన్నాయని తెలిపారు. అలిపిరి నుండి బాకరాపేట, దేవరకొండ, చిన్నగొట్టిగల్లు, బిడిగి గ్రామం, బహుదా నది, రాజంపేట మీదుగా తిరుపతికి చేరుకునేందుకు సుమారు 300 కిలోమీటర్ల దూరం ఉందన్నారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మొర్రంశెట్టి రాములు మాట్లాడుతూ సప్తగిరుల దర్శనం - సర్వపాపనాశనమని, శ్రీవారి దర్శనంతో పాటుగా సప్తగిరుల ప్రదక్షిణ చేసే అవకాశం భక్తులకు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకు తాను ఒక వాహనాన్ని కల్పించి నామినల్ ధరలతో భక్తులకు సప్తగిరుల ప్రదక్షిణ కల్పించేందుకు ప్రయత్నం చేస్తానని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో శ్రీవారి సేవకులు అసోసియేషన్ ప్రతినిధులు ప్రకాష్, ఆర్.మహేష్ పాల్గొన్నారు.

## జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** ఏపీ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన బుధవారం శ్రీ పద్మావతి మహిళా ప్రార్థనా మందిరంలో నిర్వహించే జాతీయ పెన్షనర్స్ దినోత్సవం వేడుకలను జయప్రదం చేయాలని అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జే.రామలింగారెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో ఆయన మాట్లాడారు. ఉద్యోగ వృత్తిలో నిరంతర సేవలు అందించి పదవీ విరమణ పొందిన వారి అభ్యున్నతి కోసం పోరాట స్ఫూర్తి ప్రధాత ధర్మస్వరూప్ నకారా పెన్షన్ హక్కును సాధించారని గుర్తుచేశారు. ఆయన పుట్టిన రోజున జాతీయ పెన్షనర్స్ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్డీ.సుబ్రమణ్యం, కోశాధికారి ఎల్.సుశీల, ఎ.రాజశేఖర్, ఆర్.శ్రీనివాసులురెడ్డి, సీఎస్.మణి, దామోదరరెడ్డి, టి.సుబ్రమణ్యంరెడ్డి, వెంకటరావు, నారాయణరెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్లలో సమయపాలన పాటించండి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** అన్న కాంటీన్లలో ఆహార పదార్థాలను ఒక నిర్ధిష్ట సమయంలో పంపిణీ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య నిర్వాహకులను ఆదేశించారు. సోమవారం నగరంలోని న్యూ బాలాజీ కాలనీలోని అన్న కాంటీన్‌ను కమిషనర్ పరిశీలించారు. అందిస్తున్న ఆహారం బాగుందా? సరిపడినంత వడ్డీస్తున్నారా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ టిఫిన్, భోజనం ప్రతి రోజూ ఒక నిర్ధిష్ట సమయంలో పంపిణీ చేయాలని తెలిపారు. ఆహార పదార్థాలు నాణ్యతతో వడ్డించాలని సూచించారు. పరిసరాలను, వంట పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు.

## చిన్నారులకు మెరుగైన సేవలందించండి

**ప్రజాశక్తి - పిచ్చా టూరు :** అంగన్వాడీల ద్వారా చిన్నారులతో పాటు గర్భిణులకు, బాలింతలకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. సోమవారం పిచ్చాటూరు ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకొని మినీ నుండి అంగన్వాడీలుగా ప్రమోట్ అయిన వారికి, కొత్తగా నియామకం అయిన అంగన్వాడీ కార్యకర్తలకు అపాయింట్మెంట్ లెటర్‌లను, మొబైల్ ఫోన్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా అంగన్వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నా, సమస్యలు ఏమైనా ఉన్నా సీడీపీఓ ద్వారా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో సీడీపీఓ సౌభాగ్య, ఎంపిడిఓ మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## నైపుణ్యాల అభివృద్ధితోనే ఆర్థిక స్వావలంబన

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం మూడు నెలల టైలరింగ్ /అప్పేరల్ డిజైనింగ్ శిక్షణ కార్యక్రమము, ఉత్పత్తి కేంద్రాన్ని,మహిళా విశ్వవిద్యాలయ హోమ్ సైన్స్ విభాగ ఆధ్వర్యంలో బేకరీ యూనిట్ ను మహిళా విశ్వవిద్యాలయ గౌరవనీయులు ఉపకులపతి ప్రొఫెసర్ వి. ఉమా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వి. ఉమ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులు /మహిళల ఆర్థిక స్వాలంబనకు నైపుణ్యాభివృద్ధి అత్యంత కీలకమని ముఖ్యంగా వస్త్ర రూపకల్పన, టైలరింగ్ వంటి వృత్తి నైపుణ్యాల ద్వారా ఉపాధి అవకాశాలు విస్తృతంగా కల్పిస్తాయని, విద్యతోపాటు జీవనోపాధికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేయడం స్వయం ఉపాధి, స్టాటప్ వంటి ఆలోచనలకు అవకాశం కల్పించడం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అన్నారు. నేటి సమాజంలో పోషక ఆహార లోపాలు, జీవన శైలి ద్వారా వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయ ఆవరణంలో విద్యార్థులకు, సిబ్బందికి బేకరీ యూనిట్ ద్వారా పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు అందించాలనే ఉద్దేశంతో ఈ యూనిట్ ని ప్రారంభించామని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజని మాట్లాడుతూ విద్యార్థులలో స్వతంత్ర నిర్ణయ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడానికి ఈ కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ టి.సుధ, ప్రొఫెసర్ అరుణ, ప్రొఫెసర్ బిందు, ప్రొఫెసర్ నీలిమ, టైలరింగ్/ అప్పేరల్ డిజైనింగ్ కోఆర్డినేటర్ మహిళా అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్.కే. హైమావతి, మహిళా అధ్యయన కేంద్ర, విభాగ సిబ్బంది పాల్గొన్నారు.